సైబర్ క్రైంపై అవగాహన

కామారెడ్డిలో సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కామారెడ్డి, మార్చి 5 : సైబర్ జాగృతి దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రయాణికులకు సైబర్ క్రైంపై పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తున్నారు.. దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు. 1930కు డయల్ చేసి సైబర్ నేరగాళ్లపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అపరిచితులకు ఓటీపీ చెప్పకూడదని సూచించారు. కార్యక్రమంలో సైబర్ కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

బాన్సువాడ, మార్చి 5 : బాన్సువాడ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్న తర్వాత కమిటీ చైర్‌పర్సన్ అంజవ్వ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ బడ్జెట్‌పై చర్చించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజంపేట్, మార్చి 5 : మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో రాజంపేట సొసైటీ వైస్ చైర్మన్ రమేశ్ సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలి వేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

మాచారెడ్డి, మార్చి 5 : పాల్వంచ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా మాజీ కో–ఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు ముస్తాక్‌హుస్సేన్(60) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్నా మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ముస్తాక్‌హుస్సేన్ మృతదేహానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారుడి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

పీఎం అప్రెంటీస్ షిప్ మేళా

ఖలీల్‌వాడి, మార్చి 5 : జిల్లాకేంద్రంలోని బాలుర ఐటీఐలో ఈనెల 10న పీఎం అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తి చేసి, 18 సంవత్సరాలు నిండిన వారుఅర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాకు హాజరు కావాలనుకునే వారు https://www/apprentieeshipindia.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఎస్సెస్సీ, ఐటీఐ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో ఒరిజినల్స్, ఒక సెట్ జిరాక్స్ తీసుకురావాలని పేర్కొన్నారు. మేళాకు హైదరాబాద్ నుంచి ఐఅండ్‌టీ, మహీంద్ర అండ్ మహీంద్ర, తెలంగాణ ఆర్టీసీ, టాటా మోటార్స్, హ్యుందాయ్, వరుణ్ మోటార్స్, సుఖ్‌జిత్ స్టార్చ్ మిల్, తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441074767 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సదరం క్యాంపుల నిర్వహణకు సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, మార్చి 5 : సదరం క్యాంపు నిర్వహణకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో బుధవారం సెర్ప్ సీఈవో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. జిల్లాలో సదరం క్యాంపుల నిర్వహణకు అవసరమైన పరికరాలు, మిషనరీ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఆ ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ఫరీద, జిల్లా దవాఖాన కో ఆర్డినేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

రాజంపేట్, మార్చి 5 : మండలంలోని ఎల్లాపూర్ తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి ఐదు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. కేసు నమోదు చేసి వారిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పరీక్షా కేంద్రంలో విద్యార్థికి అస్వస్థత

నస్రుల్లాబాద్, మార్చి 5 : బీర్కూర్‌లోని జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రంలో నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థి అరవింద్ అస్వస్థతకు గురయ్యాడు. ఆ విద్యార్థిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

హెచ్ఐవీపై కళాజాత ప్రదర్శన

ముత్యంపేటలో హెచ్ఐవీపై కళాజాత నిర్వహిస్తున్న బృందం సభ్యులు

బీబీపేట్(దోమకొండ), మార్చి 5 : దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైఆర్‌జీకేర్ లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ పై బుధవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవీ నివారణ, జాగ్రత్తల గురించి కళాబృందం సభ్యులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ జ్యోతి, లింక్ వర్కర్ బాలకిషన్, దోమకొండ మండల రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు రవికుమార్, డివిజన్ సభ్యులు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జనగామలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీఎంవో అబ్బాగౌడ్

తిప్పాపూర్‌లో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

బాన్సువాడ రూరల్, మార్చి 5 : ఉష్ణోగ్రలు పెగిరిగిన నేపథ్యంలో పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో సత్యనారాయణరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్‌కు సూచించారు. మండలంలోని సోమేశ్వర్ గ్రామంలోని నర్సరీ, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను ఆయన బుధవారం పరిశీలించారు. వేసవికాలాన్ని దృష్టిలో దృష్టిలో పెట్టుకొని నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజూ నీళ్లు పట్టించాలని అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా డంపింగ్‌యార్డులోనే వేయించాలని క్యాదర్శికి సూచించారు. వైకుంఠధామాల్లో పిచ్చి మొక్కలను తొలగించాలని చెప్పారు. గ్రామంలో ఉపాధిహామీ పనులు కొనసాగాలని, పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ వంద రోజులు పూర్తయ్యేలా పని కల్పించాలని ఉపాధిహామీ క్షేత్రసహాయకుడు రామును ఆదేశించాడు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి

బీబీపేట్, మార్చి 4 : కొలతల ప్రకారం ఉపాధిహామీ పనులు చేయాలని, గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీఎంవో అబ్బాగౌడ్ అన్నారు. మండలంలోని జనగామ గ్రామంలో పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించి కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ కల్యాణికి సూచించారు. ఇంటి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రజిని, టీఏ వినయ్ పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, పంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

భిక్కనూరు, మార్చి 5 : మండలంలోని తిప్పాపూర్ శివారులో చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని సిబ్బందికి సూచించారు.

869 మంది కూలీలతో ఉపాధి పనులు

నాగిరెడ్డిపేట, మార్చి 5: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం 869 మంది కూలీలతో ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలో పనులు జరుగుతున్నాయన్నారు. పంట పొలాలకు ఫార్మెషన్ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కూలీల సంఖ్యను పెంచాలని గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు సూచించామని ఆయన పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని వినతి

బీర్కూర్ తహసీల్దార్ లతకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

నస్రుల్లాబాద్, మార్చి 5 : బీర్కూర్‌లో కొన్ని రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో మూడు పెంకుటిండ్లు కాలిపోగా బాధితులు బీర్కూర్ తహసీల్దార్ లతకు మండల కేంద్రంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో తమకు ఇండ్లను కేటాయించాలని కోరారు. ఈ విషయ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

బీర్కూర్‌లో కొన్ని రోజుల క్రితం మూడు పెంకుటిండ్లు షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయాయి. బాధిత కుటుంబాలకు 150 కేజీల బియ్యం, రూ.15వేల నగదును మాజీ జడ్పీటీసీ సభ్యుడు ద్రోణవల్లి సతీశ్ అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అహల్యాబాయి హోల్కర్‌కు నివాళి

అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ త్రివేణి

కామారెడ్డి, మార్చి 5 : జిల్లా కేంద్రంలోని ఆర్‌కే అండ్ ఎస్‌ఆర్కే డిగ్రీ కళాశాలలో ఇండోర్ మహారాణి దేవీ అహల్యాబాయి హోల్కర్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ వంగరి త్రివేణి హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ సైదయ్య, దత్తాత్రి, నవీన్, గోవర్ధన్, గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నస్రుల్లాబాద్, మార్చి 5 : బీర్కూర్ తెలంగాణ తిరుమల దేవస్థానంలో రెండోరోజు శ్రీవారి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. దేవనాద రామానుజ జీయర్ స్వామిచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాడ వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, అప్పారావు, నాగేశ్వర్‌రావు, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సులభమైన పద్ధతిలో బోధించాలి



విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న డీఈవో రాజు

గాంధారి, మార్చి 5: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేవిధంగా పాఠాలను బోధించాలని డీఈవో రాజు అన్నారు. మండలంలోని పొతంగల్ కలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి టీఎల్ఎమ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రంగారావు, ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీహరి, రజని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బాగా చదువుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

రామారెడ్డి (సదాశివనగర్), మార్చి 5: విద్యార్థులు బాగా చదువుకోవాలని, ప్రభుత్వం వారిపై లక్షల రూపాయలను ఖర్చు చేస్తూ అన్ని రకాల వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నదని అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి అన్నారు. సదాశివనగర్ మాడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన యాన్యువల్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఉండడంతో అనేక కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డీఈవో రాజు, ఎంఈవో జోసెఫ్, ఏఎఫ్‌వో సుధాకర్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



స్వయం పాలనలో పాల్గొన్న 10వ తరగతి విద్యార్థులు

నాగిరెడ్డిపేట, మార్చి 5: మండలంలోని మాల్తుమ్మెద ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం జరుపుకొన్నారు. పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా సత్యనారాయణగౌడ్, ఎంఈవోగా సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయుడిగా ప్రవీణ్, ఉపాధ్యాయులుగా యశస్విని, ఆకాంక్ష, అయాన్, వరలక్ష్మి, శరణ్య,సౌమ్య, అమ్రిన్ విధులు నిర్వర్తించారు. వారి బోధనా తీరును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాజు పర్యవేక్షించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పారిశుద్ధ్య పనులు కొనసాగించాలి

లింగంపేట, మార్చి 5: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని మండల పంచాయతీ అధికారి మల్హరీ సూచించారు. మండలంలోని భవానీపేట, కంచుమహల్, ముంబాజీపేట, మెంగారం, లింగంపేట గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. మురికి కాలువల్లో నుంచి రోడ్లపై వేసిన మట్టిని తొలగించి రోడ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

నాగిరెడ్డిపేట, మార్చి 5: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రభాకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

• సీఐ రవీందర్‌నాయక్ • ఎల్లారెడ్డి పట్టణంలో కవాతు చేసిన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 5: మీకు అండగా మేముంటాం.. మీకు ధైరాన్ని ఇవ్వడానికే కవాతు నిర్వహిస్తున్నామని సీఐ రవీందర్‌నాయక్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో ఆయన కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు శివాజీచౌక్, వైశ్యభవన్, డెయిలీ మార్కెట్, గాంధీచౌక్, బస్టాండు, అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దుండిగల్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించామన్నారు. పట్టణంలోఎటువంటి అల్లర్లు సృష్టించినా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో మత ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు వస్తే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపు చేయడంలో స్థానిక పోలీసులకు వారు సహకరిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలలో అభద్రతా భావం కలుగకుండా, మీకు మేమున్నాం అని చెప్పడం కోసం ఈ కవాతు నిర్వహించామని వివరించారు. కవాతులో ఎస్సై బొజ్జ మహేశ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పట్టణ పురవీధుల్లో కవాతు చేస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో సీఐ రవీందర్ నాయక్

యువకులపైకి దూసుకెళ్లిన బైక్

●పలువురికి గాయాలు ●బైక్‌పై నుంచి పడి మహిళ అక్కడికక్కడే మృతి



మణెమ్మ (ఫైల్)

రామారెడ్డి, మార్చి 5 : బైక్ అదుపు తప్పి ఢీకొని పలువురు గాయపడగా, బైకుపై వెనుక కూర్చున్న మహిళ కిందపడి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి మండలకేంద్రంలో చోటు చేసుకొన్నది. రామారెడ్డి ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చౌకి అరవిం ద్, బానురి చంద్రారెడ్డి, లచ్చపల్లి ప్రణయ్ రాత్రి 9:30 గంటలకు భోజనం అనంతరం కామారెడ్డి ప్రధాన రహదారిపై వాకింగ్ చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఒగ్గు సాగర్ తన తల్లిని బైక్‌పై ఎక్కించుకొని గొల్లపల్లి నుంచి ఇంటికి వస్తున్నాడు. గ్రామానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి వాకింగ్ చేస్తున్న ముగ్గురు యువకులను ఢీ కొట్టింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. బైక్‌పై వెనుక కూర్చున్న మణెమ్మ (48) కిందపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. చౌకి అరవింద్ ఫిర్యాదు మేరకు సాగర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెరువులో ప్రమాద వశాత్తు జారిపడి వ్యక్తి మృతి..



మహమ్మదాబాద్ గ్రామంలో ఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై భువనేశ్వర్

బిచ్కుంద(జుక్కల్), మార్చి 5 : చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన లక్షెట్టి లక్ష్మణ్(45) బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

16న పాఠశాల ప్రవేశ పరీక్ష

గాంధారి, మార్చి 5: ఈ నెల 16న తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో(ఈఎంఆర్ఎస్) 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గాంధారి ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ చంద్రసిర్వీ బుధవారం తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను విద్యార్థులు ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

వసతి గృహ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నిజాంసాగర్, మార్చి 5 : నిజాంసాగర్ వెనకబడిన తరగతుల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వసతి గృహాన్ని సందర్శించి మాట్లాడారు. ఆయనవెంట సంతోష్, శ్రావణ్ కుమార్ గౌడ్, ఆకుల లక్ష్మణ్ యాదవ్, నాగరాజ్, గాజుల చంద్రశేఖర్, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

‘సుపరిపాలనకు ప్రతిరూపం అహల్యాబాయి’

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 5: సుపరిపాలనకు ప్రతిరూపంగా మరాఠారాణి అహల్యాబాయి హోల్కర్ నిలిచారని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ వంగరి త్రివేణి అన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన ఇండోర్ మహారాణి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆమె తన అద్భుతమైన కృషి ద్వారా వివిధ విభాగాల్లో శాశ్వత ముద్ర వేసిందని, ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ త్రివేణిని కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అధ్యాపకులు శంకరయ్య, నాగనిక, రాణి, సిద్ధురాజు, చంద్రకాంత్, కిరణ్, సంతోష్, సంగీత, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్ త్రివేణిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నిందితుడి రిమాండ్

లింగంపేట, మార్చి 5: మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన వల్లకాటి చంద్రశేఖర్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. గత నెల 18న చంద్రశేఖర్ ఆస్తి విషయంలో తండ్రి లింగంను కొట్టగా, లింగం చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో కుమారుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎస్సై వెంకట్‌రావు, ఏఎస్సై ప్రకాశ్, సిబ్బంది ఉన్నారు.

ఒకరి అదృశ్యం



శేఖర్ (ఫైల్)

లింగంపేట, మార్చి 5: మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన కళ్యంపేట శేఖర్ అదృశ్యమైనట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. గత శుక్రవారం ఇంట్లోంచి వెళ్లిన శేఖర్ ఎంతకీ తిరిగి రాలేదని, అతడి కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. శేఖర్ తల్లి సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

ప్రమాద స్థలాల పరిశీలన

మద్నూర్, మార్చి 5: మండలంలోని జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలను అధికారులు, పోలీసులు బుధవారం పరిశీలించారు. తరుచూ జరిగే ప్రమాదపు స్థలాలను పరిశీలించి, జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు వేగం నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, సీఐ నరేశ్, ఎస్సై విజయ్ కొండ, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై కూలిన చెట్టు

లింగంపేట, మార్చి 5: మండలంలోని మెంగారం గ్రామ శివారులో కామారెడ్డి–ఎల్లారెడ్డి రహదారిపై బుధవారం మర్రి చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారి పక్కన ఉన్న మర్రి చెట్టు కూలడంతో విషయాన్ని సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించగా రహదారిపై కూలిన చెట్టును తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన స్థల పరిశీలన



పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

లింగంపేట, మార్చి 5: మండలంలోని మోతె గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణం కోసం గుర్తించిన స్థలాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేసింది. పాఠశాల భవన నిర్మాణం కోసం మోతె గ్రామ శివారులోని 164 సర్వే నెంబర్‌లో ఉన్న 20 ఎకరాల భూమిని గుర్తించగా ఆర్డీవో పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్, సర్వేయర్ గోపి తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, మార్చి 5: మండల కేంద్రంలోని పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పీఎం సూర్య తెలిపారు. కేంద్రంలో బాల ఆధార్, ఫింగర్ ప్రింట్ అప్‌డేట్, చిరునామాలో మార్పు తదితర సేవలు అందిస్తున్నామని, ఈనెల 12వ తేదీ వరకు ఆధార్ కేంద్రం కొనసాగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.